
సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 2 । జనవరి । 2024



ఘనంగా నూతన సంవత్సరాది

జిల్లా ప్రజలు ఆంగ్ల నూతన సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. ఆలయాలలో పూజలు చేశారు.

- 9లో ▸



అర్ధాంతరంగా..

లింగంపల్లికలాన్ శివారులో పోచారం ప్రధాన కాలువపై చేపట్టిన వంతెన నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.3 /13.3

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

'31 లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలి'

కామారెడ్డి రూరల్: రేషన్ కార్డుదారులు ఈ-కేవైసీ చేయించుకోవడానికి ఈనెలాఖరు వరకు గడువు ఉందని డీఎస్‌వో మల్లికార్జున్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్నవారి కేవైసీ గురించి వారి తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. వారు సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చినప్పుడు ఈ-కేవైసీ పూర్తి చేయించాలని సూచించారు.

భగవద్గీత సత్సంగం



కామారెడ్డి అర్బన్: ప్రతి ఇంట్లో నిత్యం భగవద్గీతలోని ఒక శ్లోకం పఠించడం ద్వారా ఉత్తమ సమాజం నిర్మాణమవుతుందని శ్రీరామ కోటి జపలిఖిత ప్రచారకులు కృష్ణానందస్వామి పేర్కొన్నారు. సోమవారం కామారెడ్డిలోని గోదాదేవి ఆలయం సమీపంలో జి.నర్సింహారెడ్డి ఇంట్లో భగవద్గీత సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణానందస్వామి మాట్లాడారు. తాను హిందువును అంటే సరిపోదని, రోజు ఒక భగవద్గీత శ్లోకాన్ని కుటుంబ సభ్యులతో కలిసి పఠించాలని సూచించారు. తద్వారా ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వచ్చేనెలలో ఆర్ష గురుకుల యోగా శిబిరం

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని పాత రాజంపేట ఆర్ష గురుకులంలో 41వ (ఏకచాత్వారింశ) యోగా శిబిరం, ముగింపు ఉత్సవం వచ్చే నెల ఫిబ్రవరి 3 నుంచి 11 వరకు నిర్వహించనున్నట్లు గురుకులం మీమాంసక్ స్వామి బ్రహ్మానంద సరస్వతి తెలిపారు. ఆసక్తిగల వారు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

సీఎంకు శుభాకాంక్షలు




కామారెడ్డి టౌన్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ కలిశారు. పుష్ప గుచ్ఛాన్ని అందించి, ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు.

కొనసాగుతున్న క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. ఆదివారం నాటికి లక్షా 45 వేల 840 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. క్రషింగ్ పూర్తయ్యే వరకు రైతులు సహకరించాలని ఆయన కోరారు.

ఫుల్‌గా తాగేసింద్రు..



ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లాలో నూతన సంవత్సరం సందర్భంగా మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. డిసెంబర్ 31కి మద్యం ప్రియులు మద్యాన్ని ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేశారు. గతేడాది కంటే ఈసారి మద్యం అమ్మకాలు ఎక్కువగా జరిగినట్లు ఎక్సైజ్ వర్గాలు పేర్కొన్నాయి. జిల్లాలోని 102 వైన్స్‌లు, 17 బార్లు ఉన్నాయి. ఆదివారం డిసెంబర్ 31 సందర్భంగా ప్రభుత్వం వైన్స్‌లకు రాత్రి 12 గంటల వరకు, బార్లకు రాత్రి ఒంటి గంట వరకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో ఒకేరోజు ఐఎంఎల్ పాయింట్ నుంచి వైన్స్‌లు, బార్‌లకు 8,574 లిక్కర్ కేసులు, 8,489 కేసుల బీర్లు అమ్మకాలు జరిగాయి. ప్రతిరోజు ఐఎంల్ డిపో నుంచి లిక్కర్, బీర్లు రూ. 3 కోట్ల నుంచి రూ. 3.50 కోట్ల వరకు మద్యం అమ్మకాలు సాగించేవారు. కాని డిసెంబర్ 31 రోజే మద్యం అమ్మకాలు మూడింతలు పెరిగినట్లు ఎక్సైజ్ అధికారుల ద్వారా తెలిసింది. గతేడాది రూ. 6 కోట్లకు పైగా ఆదాయం రాగా ఈసారి రూ. 3.20 కోట్ల ఆదాయం పెరిగింది. డిసెంబర్ 31 ఆదివారం రావడం కూడా ఎక్సైజ్ శాఖకు కలిసివచ్చింది.

టికెట్ ఫ్లైజ్..

లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో కమలదళంలో కదనోత్సాహం కనిపిస్తోంది. ఆ పార్టీ తరఫున జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయడానికి పలువురు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్య నేతలను కలుస్తూ ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు.

- కమలదళంలో కదనోత్సాహం
- జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిత్వం కోసం తీవ్ర పోటీ
- రోజురోజుకు పెరుగుతున్న ఆశావహులు
- ఎవరి ప్రయత్నాల్లో వారు బిజీబిజీ..



పైడి ఎల్లారెడ్డి
బాణాల లక్ష్మారెడ్డి
మేడపాటి ప్రకాశ్‌రెడ్డి
వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి
సోమాయప్ప స్వామీజీ
పైలా కృష్ణారెడ్డి
మురళీధర్‌గౌడ్

సాక్షి, కామారెడ్డి: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గాలు, సంగారెడ్డి జిల్లాలోని నారాయణ్‌ఖేడ్, అందోల్, జహీరాబాద్ నియోజకవర్గాలున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన జరిగిన తర్వాత 2009 ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ విజయం సాధించారు. 2014, 2018 లలో బీఆర్‌ఎస్ అభ్యర్థి బీబీ పాటిల్ గెలుపొందారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఆశావహులు ఎందరో..

తాడ్వాయి మండలం దేవాయిపల్లికి చెందిన ప్రముఖ సైంటిస్ట్, సామాజిక సేవల్లో ముందుండే డాక్టర్ పైడి ఎల్లారెడ్డి బీజేపీ టికెట్టు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఆయన నిత్యం పర్యటిస్తున్నారు. దశాబ్దాలుగా ఆయన సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో ఇప్పటికే పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేశారు. ఆయనకు ఆర్‌ఎస్‌ఎస్ నేతలతోనూ సన్నిహిత సంబంధాలున్నాయి. ఇటీవల ఆయన పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకులను కలిసి తన బయోడేటాను అందించారు.

❖ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా మాజీ అధ్యక్షుడు బాణాల లక్ష్మారెడ్డికి పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకులతో సన్నిహిత సంబంధాలున్నాయి. ఆయన దశాబ్దాలుగా పార్టీలో కొనసాగుతున్నారు. గతంలో ఎల్లారెడ్డి అసెంబ్లీ స్థానంతోపాటు జహీరాబాద్ ఎంపీ స్థానంనుంచి పోటీ చేసి చెప్పుకోదగ్గ ఓట్లు సాధించారు. ఈసారి టికెట్టు తనకే వస్తుందన్న ధీమాతో ఉన్నారు.

❖ అసెంబ్లీ ఎన్నికలలో బోధన్ టికెట్టు కోసం చివరి నిమిషం వరకు ప్రయత్నించిన మేడపాటి ప్రకాశ్ రెడ్డి కూడా జహీరాబాద్ టికెట్టు రేసులో ఉన్నారు. ఆయన నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ద్వారా పార్టీ ముఖ్యనేతలను కలుస్తూ పార్టీ అభ్యర్థిత్వం కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

❖ పార్టీ అవకాశం ఇస్తే జహీరాబాద్ ఎంపీ స్థానం నుంచి పోటీ చేస్తానని ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంనుంచి పోటీ చేసి ఓడిపోయిన వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని కలిసి అవకాశం ఇవ్వాలని కోరారు.

❖ కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన మురళీధర్‌గౌడ్ విద్యార్థి దశనుంచి సంఘ్ పరివార్‌తో అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు. ఆయనకు పార్టీ జాతీయ నేతలతోనూ మంచి సంబంధాలున్నాయి. ఈసారి జహీరాబాద్ ఎంపీ టికెట్టు ఆశిస్తున్నారు.

❖ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో లింగాయత్ సామాజికవర్గ ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నారు. ఈ నేపథ్యంలో బిచ్కుందలోని బండాయప్ప మఠాధిపతి సోమాయప్ప కూడా టికెట్టు ఆశిస్తున్నట్టు తెలుస్తోంది.

❖ ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టికెట్టు ఆశించి భంగపడిన పైలా కృష్ణారెడ్డి, నాగిరెడ్డిపేట మండలానికి చెందిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి న్యాయవాది రచనారెడ్డి, గాంధారి మండలానికి చెందిన ప్రొఫెసర్ రాంసింగ్, ఎల్లారెడ్డికి చెందిన ప్రముఖ వైద్యుడు నాగేశ్వరరావులు కూడా బీజేపీ టికెట్టు కోసం ప్రయత్నిస్తున్నారు.

❖ ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ ఆలె నరేంద్ర తనయుడు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు ఆలె భాస్కర్‌తోపాటు మరికొందరు కూడా కమలం గుర్తుపై పోటీ చేయడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

కామారెడ్డి గెలుపు ఊపుతో...

జహీరాబాద్ ఎంపీ స్థానం పరిధిలోని అసెంబ్లీ సీట్లలో ఇటీవల నిర్వహించిన ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులు గణనీయంగా ఓట్లు సాధించారు. కామారెడ్డినుంచి పోటీ చేసిన వెంకటరమణారెడ్డి.. ఇద్దరు ఉద్దండులను ఓడించి చరిత్ర సృష్టించారు. జిల్లాలోని మిగిలిన స్థానాలలో పోటీ చేసిన బీజేపీ అభ్యర్థులకూ చెప్పుకోదగ్గ స్థాయిలో ఓట్లు వచ్చాయి. సంగారెడ్డి జిల్లా పరిధిలోని ఆందోల్, నారాయణ్‌ఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గాల్లో మాత్రం పెద్దగా ప్రభావం కనబడలేదు. అయినప్పటికీ పార్లమెంట్ ఎన్నికల సమయంలో మోదీ ప్రభావం ఉండే అవకాశాలున్నాయి. మోదీ చరిష్మాతోపాటు అయోధ్యలో రామమందిర నిర్మాణం కలిసి వస్తుందని ఆశిస్తున్నవారు ఎంపీ ఎన్నికలలో కమలం గుర్తుపై పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఎన్నికల నాటికి మరికొందరి పేర్లు తెరపైకి వచ్చే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

గ్యారంటీలతో ప్రజలకు భరోసా



జుక్కల్ క్యాంపు ఆఫీస్‌లో హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

- ఎంపీ ఎన్నికల నాటికి హామీలను అమలు చేస్తాం
- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్: ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల అమలుపై దృష్టి సారించిందని, వీటితో ప్రజలకు ఆర్థిక భరోసా లభిస్తుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. సోమవారం జుక్కల్‌లో కాంగ్రెస్ పార్టీ విజయోత్సవ ర్యాలీ, సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని, రూ. 10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ వర్తింప చేసిందని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల నాటికి మిగిలిన హామీలనూ నెరవేరుస్తామన్నారు.

క్యాంపు ఆఫీసులో హోమం

జుక్కల్ మండల కేంద్రం శివారులో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలోనే నిర్మించినా ఇన్నాళ్లా ప్రారంభానికి నోచుకోలేదు. కొత్త ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ముస్తాబు చేయించి, మౌలిక వసతులు కల్పించారు. సోమవారం కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమాలలో పార్టీ నాయకులు జయప్రదీప్, వినోద్, రమేష్‌దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే

తాత్కాలికంగా డిస్ట్రిబ్యూటరీల మూసివేత

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు ఆయకట్టుకు సంబంధించి 'ఏ' జోన్ పరిధిలో గల ప్రధాన కాలువ డిస్ట్రిబ్యూటరీలను సోమవారం ఇరిగేషన్ అధికారులు తాత్కాలికంగా మూసివేయించారు. నిబంధనల ప్రకారం ఈ రబీ సీజన్‌లో పోచారం ప్రాజెక్టు నీటిని ఆయకట్టు పరిధిలోని 'బీ' జోన్‌కు కేటాయిస్తున్నారు. దీంతో 'ఏ' జోన్ పరిధిలో ప్రాజెక్టు నీరు వృథా కాకుండా ఉండేందుకుగానూ ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రధానకాలువ డిస్ట్రిబ్యూటరీలలో పాక్లెయిన్‌తో మట్టిపోసి మూసేశారు. 'ఏ' జోన్ పరిధిలోని డి-1 నుంచి డి-44 వరకు డిస్ట్రిబ్యూటరీలను మూసివేస్తున్నట్లు ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు.



పోచారం ప్రధానకాలువ డిస్ట్రిబూటరీని మట్టితో మూసేస్తున్న దృశ్యం

ఘనంగా ఎమ్మెల్యే కేవీఆర్ జన్మదిన వేడుకలు



జిల్లా కేంద్రంలో జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డి(కేవీఆర్) జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని గాంధీగంజ్‌లో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు భారీ సంఖ్యలో ఈ వేడుకలలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా గంజ్‌లో పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. తన విజయానికి కృషి చేసి, తనపై అభిమానం చాటుతున్న వారికి ఎప్పటికీ రుణపడి ఉంటానని కేవీఆర్ పేర్కొన్నారు.

జోరుగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): జిల్లా కేంద్రంలో న్యూఇయర్ వేడుకల సందర్భంగా పోలీసులు ఆదివారం రాత్రి 10 గంటల నుంచి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు, పోలీసులు వాహనదారులను ఆపి తనిఖీలు చేశారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పకడ్బందీగా చర్యలు చేపట్టారు. నూతన సంవత్సర వేడుకల వద్ద పోలీసులు ఆంక్షలు విధించడంతో ప్రజలు ఎక్కువగా రోడ్లపైకి రాలేదు. పోలీసులు, అదనపు బలగాలు షిఫ్ట్‌ల వారీగా సోమవారం ఉదయం వరకు ప్రధాన కూడళ్ల వద్ద తనిఖీలు చేశారు. మద్యం సేవించి వాహనాలపై వెళ్లకూడదని పోలీసులు ముందుగానే హెచ్చరించడంతో చాలామంది ఇంటికి పరిమితమయ్యారు. దీంతో నగరంలోని చాలారోడ్లు నిర్మానుష్యంగా మారాయి. రోడ్ల పైకి వచ్చిన వాహనాలను పోలీసులు తనిఖీలు చేస్తూ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించిన పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నిర్వహించారు. నూతన సంవత్సర సందర్భంగా డీజే సౌండ్‌కు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో శబ్ద కాలుష్యం. పటాకుల సౌండ్ కూడా అంతగా కనిపించలేదు. దీంతో పాటు యువకులు వీధుల్లోకి వచ్చి డాన్స్‌లు చేసిన దాఖలాలు కనిపించలేవు.

ఉమ్మడి జిల్లాలో గంజాయి ఘాటు

గ్రామాల్లో విచ్చలవిడిగా లభ్యం

- నాలుగేళ్లుగా యథేచ్ఛగా ఓ పార్టీకి చెందిన చోటా నాయకుల గంజాయి దందా
- పాఠశాల విద్యార్థులు కూడా గంజాయి హుక్కా సేవించే పరిస్థితి
- ఓ గ్రామంలో తొమ్మిదో తరగతి విద్యార్థి ఆస్పత్రి పాలైన దుస్థితి
- గంజాయి సేవించాలంటూ విద్యార్థిని చితకబాదిన మరో ఐదుగురు విద్యార్థులు

ఉమ్మడి జిల్లాలో గంజాయి దందా విచ్చలవిడిగా సాగుతోంది. నాలుగేళ్లుగా ఓ పార్టీకి చెందిన చోటా నాయకులుగా చెలామణి అయినవాళ్లు అడ్డగోలుగా గంజాయి విక్రయాలను గ్రామాల్లో ప్రోత్సహించడంతో పాటు దీన్ని ప్రధాన ఆదాయ వనరుగా ఉపయోగించుకున్నారు. వీళ్లకు ఒకరిద్దరు నియోజకవర్గస్థాయి కీలక ప్రజాప్రతినిధులు అండగా ఉండడంతో గ్రామాల్లో గంజాయి సరఫరా ఇష్టారాజ్యంగా సాగింది.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో గంజాయి గుప్పుమంటోంది. పరిస్థితి ఏవిధంగా తయారైందంటే చివరకు పాఠశాల విద్యార్థులు కూడా విపరీతంగా గంజాయి సేవించే వరకు వచ్చింది. గతంలో పొదలు, పాడుబడిన భవనాలను అడ్డాగా చేసుకునే పరిస్థితి నుంచి ఇప్పుడు ఏకంగా పాఠశాలల్లోనే ఉపయోగించే స్థాయికి గంజాయి విక్రయాలు, వాడకం పెరగడం గమనార్హం. యువత నుంచి పాఠశాల విద్యార్థుల వరకు పలువురు గంజాయి హుక్కాకు బానిసలు కావడం పరిస్థితికి అద్దం పడుతోంది. జిల్లా, మండల కేంద్రాలు, గ్రామాల్లో విచ్చలవిడిగా ఉమ్మడి జిల్లాలో గంజాయి లభ్యమవుతోంది. మహిళలు కూడా కొన్నిచోట్ల యథేచ్ఛగా గంజాయి సేవించే విధంగా తయారవడం ఆందోళనకరంగా తయారైంది. గంజాయికి బానిసలైనవాళ్లకు ఎక్కువ ధరకు విక్రయిస్తుండడం గమనార్హం. ఈ క్రమంలో కొన్నిచోట్ల ఓ అడుగు ముందుకేసి మరీ జనసంచారం లేని ప్రాంతాల్లో గంజాయి మొక్కలు కూడా పెంచుతున్నట్లు తెలుస్తోంది. కాగా గంజాయి అమ్ముతున్న డొంకేశ్వర్ మండలానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల జైలుకు కూడా వెళ్లి వచ్చాడు.



■ ఇటీవల డొంకేశ్వర్ మండలంలోని ఒక గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థి గంజాయికి బానిసై ఎక్కువ మోతాదులో తీసుకోవడంతో అస్వస్థతకు గురై ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకుని గల్ఫ్‌లో ఉన్న సదరు బాలుడి తండ్రి స్వదేశానికి తిరిగి వచ్చినట్లు తెలిసింది.

■ డొంకేశ్వర్ మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో గంజాయి ప్యాకెట్ లభించగా.. విషయం బయటకు పొక్కకుండా దాన్ని కాల్చేసినట్లు తెలిసింది. ఇక ఉమ్మడి జిల్లాలోని ఓ వసతిగృహంలో కూడా పాఠశాల విద్యార్థుల వద్ద గంజాయి లభించినట్లు సమాచారం.

■ రెండు వారాల క్రితం మాక్లూర్ మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న ఓ విద్యార్థిని గంజాయి సేవించాలంటూ మరో ఐదుగురు తోటి విద్యార్థులు బలవంతం చేశారు. ఈ విషయాన్ని సదరు విద్యార్థి తన తల్లికి చెప్పడంతో ఆమె వచ్చి మందలించింది. దీంతో విషయాన్ని తల్లికి ఎందుకు చెప్పావంటూ ఆ ఐదుగురు విద్యార్థులు సదరు విద్యార్థిని తీవ్రంగా కొట్టారు. దీంతో దాడికి గురైన విద్యార్థి ఆస్పత్రి పాలయ్యాడు. దీంతో ఆ విద్యార్థి తల్లి మాక్లూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

■ గతంలోనూ ఓ మాజీ ప్రజాప్రతినిధి అనుచరుడు తన గ్రామానికే చెందిన మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లను హత్య చేయించేందుకు బీహార్ ముఠాకు రూ.10 లక్షల సుపారీ మాట్లాడుకుని పట్టుబడడం తెలిసిందే. ఈ క్రమంలో పోలీసులు అరెస్టు చేసి విచారణ చేసిన నేపథ్యంలో పెద్ద ఎత్తున గంజాయి లభ్యమైంది. అయినప్పటికీ గంజాయి విషయమై కేసు లేకుండా ఆ మాజీ ప్రజాప్రతినిధి చేయడం గమనార్హం.

అసంపూర్తిగా అదనపు గదులు

- నిధులు లేక ముందుకు సాగని పనులు
- గదులు సరిపోక ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



గాలీపూర్‌లో అసంపూర్తిగా ఉన్న అదనపు గదుల నిర్మాణ పనులు

నిజాంసాగర్: అదనపు గదులు నిర్మాణం పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మహమ్మద్‌నగర్ మండలంలోని గాలీపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు 85 మంది విద్యార్థులున్నారు. ఐదు తరగతుల విద్యార్థులకు రెండు గదులే ఉన్నాయి. దీంతో విద్యార్థులు వరండాల్లో, చెట్ల కింద పాఠాలు వినాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఉన్న రెండు గదులు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లారు. దాంతో జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ రూ.20 లక్షలు మంజూరు చేశారు. అదనపు గదుల నిర్మాణానికి కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. వచ్చిన నిధులు సరిపోకపోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఆరు నెలలుగా పనులు ముందుకు సాగడం లేదు. అసంపూర్తిగా నిలిచిన అదనపు గదుల పనుల విషయాన్ని పాఠశాల హెచ్ఎం అమర్‌సింగ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. గదులు సరిపోక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నిధులు మంజూరు చేసి పనులు పూర్తయ్యేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అదనపు గదుల నిర్మాణం చేపట్టాలి



ప్రభుత్వం పాఠశాలలో వసతులతో పాటు అదనపు గదుల నిర్మాణం చేపట్టాలి. సర్కారు బడుల్లో చదువుకుంటున్న పేద పిల్లల విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేయాలి. గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. – నిహారిక, పదో తరగతి

వరండాల్లో చదువుకుంటున్నాం



మా పాఠశాలలో గదుల కొరత ఉండటంతో వరండాల్లో చదువుకుంటున్నాం. చెట్ల కింద, వరండాల్లో చదువు క్లాసులు వినడంతో పాఠాలు అర్థం కావడం లేదు. అదనపు గదుల పనుల పూర్తి చేయాలి. – కీర్తన, పదో తరగతి

ఎల్లారెడ్డి డీఎస్పీకి పోలీసు సేవా పతకం

- జాబితాలో మరో నలుగురు..

సాక్షి, కామారెడ్డి: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన పోలీస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా జనవరి ఒకటో తేదీన సేవా పతకాలను ప్రకటిస్తోంది. అందులో భాగంగా సోమవారం ప్రకటించిన జాబితాలో జిల్లాకు చెందిన ఐదుగురు పోలీస్ అధికారుల పేర్లున్నాయి. ఎల్లారెడ్డి డీఎస్పీ అనుమాసు శ్రీనివాసులు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ నల్ల భూపాల్, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ అల్వాల సురేందర్, పెద్దకొడప్‌గల్ ఏఎస్సై వరికుప్పల రాములు, సదాశివనగర్ ఏఎస్సై తమ్మె గంగాసాగర్ సేవా పతకాలకు ఎంపికయ్యారు. వీరిని జిల్లా పోలీసు అధికారి సీహెచ్ సింధు శర్మ అభినందించారు.

క్లుప్తంగా

గిరిరాజ్ కాలేజీ అధ్యాపకుడికి పదోన్నతి

నిజామాబాద్అర్బన్: గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల తెలుగు విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎస్ అంబర్ సింగ్‌కు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి లభించింది. ఆయన గతంలో ఉమ్మడి జిల్లా బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి గాయాలు

నిజామాబాద్ రూరల్: బైక్ అదుపు తప్పి ఒకరు గాయపడిన ఘటన ఆదివారం అర్ధరాత్రి కంఠేశ్వర్ బైపాస్‌రోడ్డులో చోటు చేసుకుంది. ముబారక్‌నగర్‌కు చెందిన రజనీకాంత్ బైక్‌పై వెళ్తూ ఒక్కసారిగా కిందపడిపోయాడు. అక్కడే ఉన్న కానిస్టేబుళ్లు అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆయనను ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై మహేశ్‌కుమార్ తెలిపారు. రజనీకాంత్‌ను ప్రాణపాయ స్థితి నుంచి కాపాడి ఆస్పత్రికి తరలించిన కానిస్టేబుళ్లను డీసీపీ జయరాం, ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ వెంకటనారాయణ అభినందించారు.

దర్జీల నుంచి కొటేషన్ల ఆహ్వానం

డిచ్‌పల్లి: జిల్లాలోని ఇందల్వాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కో ఎడ్యుకేషన్ పాఠశాలలో బాలుర, బాలికలకు యూనిఫామ్ కుట్టేందుకు ఆసక్తిగల దర్జీల నుంచి సీల్డ్ కొటేషన్‌లు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రాంతీయ సమన్వయకర్త సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వ్యక్తులు లేదా సంస్థలు వచ్చే నెల 8తేదీ లోపు ఇందల్వాయిలోని ఈఎంఆర్ఎస్ పాఠశాలలో ప్రిన్సిపాల్‌కు సీల్డ్ కొటేషన్‌లు సమర్పించుకోవాలని కోరారు. నియమ నిబంధనల అనుసారం యూనిఫామ్‌లు కుట్టివ్వాల్సి ఉంటుందన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ద్వారా టెండర్ ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామని వెల్లడించారు. టెండర్ ఫారంల కోసం ఇందల్వాయి ప్రిన్సిపాల్ ఫోన్ నెంబర్ 8501913274ను సంప్రదించాలని కోరారు.

తవ్వారు.. వదిలేశారు

- ముందుకు సాగని ముల్లంగి(బి) రోడ్డు పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మాక్లూర్: రోడ్డును తవ్వి మూడు నెలలు అవుతున్నా కొత్తగా రోడ్డు వేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ముల్లంగి(బి) నుంచి మాక్లూర్ మార్గంలో డక్‌ఫారం వరకు 2.8 కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో ప్రభుత్వం కొత్త రోడ్డు వేయడానికి రూ.71 లక్షలు మంజూరు చేసింది. నిధులు మంజూరు కావడంతో సెప్టెంబర్‌లో పనులు ప్రారంభించారు. రోడ్డును తవ్వి కంకర పోశారు. తర్వాత పనులు ఆపేశారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముల్లంగి(బి), బొంకన్‌పల్లి నుంచి మాక్లూర్ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కంకరపై వెళ్లే సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు రోడ్డు పనులు పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.




కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు బుక్కులు అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డి, ఆర్డీవోలు



టీఎన్జీవోస్ నాయకులు

కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు జిల్లా అధికారులు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌కు నోట్ బుక్కులు, దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా ప్రజలకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



కలెక్టర్‌కు నోట్‌బుక్కులు అందజేస్తున్న జిల్లా అధికారులు



డీఆర్‌డీవో చందర్‌రాథోడ్, సిబ్బంది



రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు



తపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్



శుభాకాంక్షలు తెలుపుతున్న పీఆర్‌టీయూ నాయకులు



దుప్పట్లు అందజేస్తున్న ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు



డీసీపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఏసీపీలు

రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల బాలికల టోర్నమెంట్‌లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. డిసెంబర్ 28 నుంచి 31వరకు భద్రాద్రి కొత్తగూడెంలో రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. ఇందులో ఇందల్‌వాయికి చెందిన గురుకుల క్రీడాకారులు కబడ్డీలో ప్రథమ స్థానం, బాక్సింగ్‌లో బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను హెచ్‌ఎం శ్రీలత, పీఈటీ సరిత, శ్రుతి అభినందించారు.



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న క్రీడాకారులు

కర్రలతో దాడులు

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 100 ఫీట్ల రోడ్డులో ఆదివారం రాత్రి 2:30 గంటలకు ఇంద్రపూర్‌కాలనీకి చెందిన రోహిత్, మను కర్రలతో ఇతరులపై దాడి చేసినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. అనంతరం కోటగల్లీ ప్రాంతంలో రోహిత్, మను మరో గ్రూపుపై దాడికి పాల్పడినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గొడవకు దారి తీసిన దానిపై విచారణ చేస్తున్నామని తెలిపారు.

కుక్కల బెడద

- గుంపులుగా తిరుగుతూ దాడులు చేస్తున్న గ్రామ సింహాలు
- ఆందోళన చెందుతున్న ప్రజలు
- బెడద నివారించాలని వేడుకోలు



గోల్‌బంగ్లా ప్రాంతంలో రోడ్డుపై వీధికుక్కలు



హుస్నాబాద్ కాలనీలో..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లో కుక్కల బెడద రోజురోజుకు పెరిగిపోతుంది. పట్టణంలోని వీధులు, రోడ్లపై శునకాలు గుంపులుగా తిరిగుతూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. పట్టణంలోని 36 వార్డులలో ఎక్కడ చూసిన ఇదే పరిస్థితి నెలకొందలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల బెడదతో పిల్లలను బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఇటీవలే పట్టణంలో సుమారు 25మందిని కుక్కలు కరిచాయి. గత శుక్రవారం పాఠశాల నుంచి ఓ వ్యక్తి తన పిల్లలను ద్విచక్ర వాహనంపై తీసుకువస్తున్న సమయంలో నాలుగు కుక్కలు వెంబడించడంతో అదుపుతప్పి మరో వాహనాన్ని ఢీకొన్నాడు. పోచమ్మ కాలనీల్లో నలుగురిని కుక్కలు కరిచాయి. దీంతో కాలనీవాసులు మున్సిపల్ కార్యాలయంలో వచ్చి ఫిర్యాదు చేశారు. కానీ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదని బాధితులు తెలిపారు. అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కుక్కలను తరలించాలి

పట్టణంలోని కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ప్రతి రోజు ప్రజలపై శునకాలు దాడులు చేస్తున్నారు. కుక్కలను పట్టుకొని అడవిలో వదలాలి.

– రామకృష్ణ, ఆర్మూర్

కబ్జా కోరల్లో ఇరిగేషన్ స్థలం



నవీపేటలోని నిజాంసాగర్ కాలువ పక్కన వెలిసిన అక్రమ నిర్మాణాలు

పట్టింపులేని అధికారులు

నవీపేట: మండల కేంద్రంలోని విలువైన ప్రభుత్వ స్థలం కబ్జా కోరల్లో చిక్కుకుంది. అధికారుల అలసత్వంతో పాటు జీపీ పాలకవర్గం నిర్లక్ష్యం తోడవడంతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రధాన కాలువ డి–50తో పాటు దాని ఉప కాలువలు మండలంలోని వివిధ గ్రామాలకు విస్తరించాయి. బాసర రహదారి పక్కన మూల మలుపు దగ్గర దాదాపు కిలోమీటర్ పొడవున కాలువ పక్కన ఉన్న స్థలంపై కబ్జాదారుల కన్ను పడింది. గతంలో బైపాస్ రోడ్డు ఇదే ప్రాంతం గుండా విస్తరణ జరుగుతుందని భావించిన స్థానికులు ఈ రోడ్డును అలాగే ఉంచారు. కానీ బైపాస్ రోడ్డు వేరే ప్రాంతం గుండా విస్తరణ జరుగుతుందని తెలిసిన కబ్జాదారులకు మింగుడుపడడం లేదు. నిజాంసాగర్ ప్రధాన కాలువకు ఆనుకుని ఉన్న స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. రూ. లక్షల విలువైన స్థలంలో తాత్కాలిక, శాశ్వత నిర్మాణాలను చేపట్టారు. జీపీ పాలకవర్గంలోని కొందరి అక్రమార్కుల అండదండలతో యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టారు. రోజుకో నిర్మాణం వెలుస్తున్నా ఇరిగేషన్ అధికారులు నోటీసులిచ్చి చేతులు దులుపుకొంటున్నారు. కేసులు నమోదు చేసిన పోలీసులు అక్కడికి వెళ్లేందుకు వెనుకంజవేస్తున్నారు. ఇరిగేషన్ స్థలంలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై వార్డు సభ్యురాలు గొల్ల శోభతోపాటు ఆమె భర్త అశోక్ వరుస ఆందోళన కార్యక్రమాలు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం మాత్రం శూన్యంగా కనిపిస్తోంది.

చర్యలు తీసుకుంటాం

నవీపేటలోని నిజాంసాగర్ కాలువ పక్కన విలువైన స్థలంలో అక్రమ నిర్మాణాలు వెలిసిన విషయం వాస్తవమే. నిర్మాణాలను పరిశీలించి కబ్జాదారులకు నోటీసులు ఇచ్చాం. పోలీసుల సహకారంతో కేసులు నమోదు చేయించాం. ప్రజాపాలన పూర్తవగానే చర్యలు తీసుకుంటాం.

– బలరాం, డీఈఈ ఇరిగేషన్, నిజామాబాద్

బీసీటీయూ కరపత్రాల ఆవిష్కరణ

సుభాష్‌నగర్: బీసీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 12న నిర్వహించే సావిత్రిబాయి పూలే అవార్డు కార్యక్రమం 9వ వార్షికోత్సవ కరపత్రాలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. అంతకు ముందు కలెక్టరేట్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి, నోట్ బుక్కులు, పెన్నులు అందజేశారు. బీసీటీయూ జిల్లా అధ్యక్షుడు మాడవేడి వినోద్‌కుమార్, ప్రధానకార్యదర్శి గోపాల కృష్ణ, నాయకులు మోహన్, డీఎల్ఎన్ స్వామి, శంకర్, రవికుమార్, కొట్టాల రామకృష్ణ, గంగోనె సంజీవ్, శ్యాంప్రసాద్, విజయ్, రమణ స్వామి, విజయ్‌కుమార్, అంబటి నర్సయ్య, రవీందర్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ



ఎల్లారెడ్డిలో పడిపూజ నిర్వహిస్తున్న స్వాములు



సదాశివనగర్‌లో పడిపూజలో పాల్గొన్న భక్తులు

సదాశివనగర్: సదాశివనగర్‌లోని అయ్యప్ప ఆలయంలో సోమవారం మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ రవి, ఎంపీటీసీ బీరయ్య, అయ్యప్ప గురుస్వాములు రాజు, వీరయ్య, అయ్యప్ప దీక్ష పరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలోని అయ్యప్ప ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి పడిపూజ నిర్వహించారు. గురుస్వాములు శ్రీనివాస్, నాగేష్, వంగపల్లి కాశీ, రాజేందర్‌నాథ్ పాల్గొన్నారు.

ఆ ఇల్లు.. పిచ్చుకల నిలయం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పిట్టలు నిత్యం వాలేది చెట్ల మీదనే. అయితే నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉంటున్న మంచాల జ్ఞానేందర్ గుప్తా, శ్రీలక్ష్మి దంపతుల ఇల్లు మాత్రం పిచ్చుకలకు నిలయంగా మారింది. వందలాది పిచ్చుకలకు ఆ ఇల్లే ప్రధాన అడ్డా. ఈ ఇంటి ఎదుట పక్షులకు ఆహారం పెట్టే పరికరాలను వేలాడదీసి వాటిలో కొర్రలను వేస్తున్నారు. పిచ్చుకలు వీటిని తింటూ ఎంజాయ్ చేస్తున్నాయి. ఇదిలా ఉండగా పక్షులకు ఆహారం అందించేందుకు గాను జ్ఞానేందర్ గుప్తా ఇప్పటివరకు సుమారు 2 వేలకు పైగా పక్షికి ఆహారం అందించే పరికరాలను ఉచితంగా పలువురికి అందించారు.



భవిష్యత్తులోనూ ఈ పరికరాలను అందించే కార్యక్రమాన్ని కొనసాగిస్తానని చెబుతున్నారు.

క్రైం కార్నర్

డిచ్‌పల్లిలో కొకైన్ పట్టివేత



ఖలీల్‌వాడి: కారులో మాదకద్రవ్యాలు తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జి సీపీ జయరాం తెలిపారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. మాదక ద్రవ్యాలు తరలిస్తున్నారనే సమాచారం మేరకు డిచ్‌పల్లి మండలం నడిపల్లి తండా వద్ద డిసెంబర్ 31న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్‌రాజు, సీఐ అజయ్‌బాబు, డిచ్‌పల్లి ఎస్సై మహేష్ వాహనాల తనిఖీ చేశారు. కోనసీమ జిల్లా ఆలుమూరు మండలం జొన్నాడ గ్రామానికి చెందిన ద్వారంపూడి విక్రమ్ హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో, పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన షైక్ ఖాజా మొహిద్దిన్ చిష్టి హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉంటున్నారు. వీరు కారులో కొకైన్ తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. 12.3 గ్రాముల కొకైన్, 3.2 గ్రాముల ఎండీఎంఏ, 3.1 గ్రాముల గంజా పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జి తెలిపారు. ఢిల్లీలోని మైక్ అనే వ్యక్తి నుంచి రాహుల్ అనే వ్యక్తి ద్వారా ఈ డ్రగ్స్‌ను న్యూ ఇయర్ వేడుకల కోసం తీసుకొచ్చినట్లు విచారణలో తేలిందన్నారు.

గుడిసె దగ్ధం



రాజంపేట: ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధమైన ఘటన రాజంపేటలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గ్యార బాలయ్య, నర్సవ్వ కుమారుడు బాలరాజు కలిసి ఉంటున్నారు. వారు ప్రస్తుతం రేకుల షెడ్‌తో నిర్మించిన ఇంట్లో ఉంటున్నారు. దాని పక్కనే అదనంగా మరో గుడిసె నిర్మించుకున్నారు. ఆదివారం కుటుంబ సభ్యులు తిని పడుకున్నారు. తెల్లవారుజామున లేచి చూసేవరకు గుడిసె కాలిపోయింది. దాంట్లో ఎవరు నిద్రించకపోవడం ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

అనుమానంతో స్నేహితుడి హత్య

- మోర్తాడ్ మండల కేంద్రంలో ఘటన



రాకేశ్(ఫైల్)



ఆందోళన చేస్తున్న స్థానికులు

మోర్తాడ్: తన భార్యతో సన్నిహిత సంబంధం ఉందనే అనుమానంతో స్నేహితుడిని హతమార్చిన ఘటన మోర్తాడ్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. నూతన సంవత్సరం రోజు ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన రాకేశ్(28), తెడ్డు సూర్య స్నేహితులు. తన భార్యతో సన్నిహిత సంబంధం ఉందని అనుమానంతో సూర్య తన స్నేహితుడు రాకేశ్‌పై కోపం పెంచుకున్నాడు. సోమవారం అతని ఇంటికి వెళ్లి కత్తితో పొడిచి హతమార్చాడు. తీవ్ర రక్తస్రావమైన రాకేశ్‌ను అతని కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ఆర్మూర్‌లోని ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు ధృవీకరించారు. దీంతో రాకేశ్ కుటుంబ సభ్యులు, స్థానికులు నిందితుడిని కఠినంగా శిక్షించాలని సూర్య ఇంటి వద్ద ధర్నా నిర్వహించారు. భీమ్‌గల్ సీఐ వెంకటేశ్వర్లు, మోర్తాడ్ ఎస్సై అనిల్‌రెడ్డిలు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి అదుపుతప్పకుండా చర్యలు తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు

ధర్పల్లి: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి ధర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు.

నిజామాబాద్‌రూరల్: న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి వరకు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 12 మంది దొరికినట్లు ఎస్సై మహేశ్‌కుమార్ తెలిపారు.

దోమకొండ: మండల కేంద్రంలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మురళి తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి వరకు డ్రంకన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించామన్నారు.



ఎక్సెల్‌ను ఢీకొన్న కారు

తాత మృతి, మనవడికి గాయాలు



ధ్వంసమైన కారు



లాలయ్య(ఫైల్)

నిజాంసాగర్: ఎక్సెల్‌ను వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన సంగారెడ్డి–నాందేడ్ జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. నిజాంసాగర్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన గారబోయిన లాలయ్య(61) తన మనవడు జ్ఞానేశ్వర్‌తో కలిసి ఎక్సెల్‌పై కారం పొడి తీసుకురావడానికి పిట్లం బయలుదేరాడు. వీరి వాహనాన్ని జాతీయ రహదారిపై వెనుక నుంచి కారు అతివేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎక్సెల్ వెనుకాల కూర్చున్న లాలయ్య అక్కడికక్కడే మృతి చెందారు. వాహనాన్ని నడుపుతున్న జ్ఞానేశ్వర్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. ఎక్సెల్ ఢీకొన్న తర్వాత కారు బోల్తా పడింది. కారులో ఉన్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. జ్ఞానేశ్వర్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. లాలయ్యకు భార్య పెంటవ్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీ చేశారు. ఈ ఘటన సోమవారం సాయంత్రం వెలుగు చూసింది. వివరాలు.. మాచారెడ్డి మండలం ఇసాయిపేట గ్రామానికి చెందిన బాలగౌడ్ కామారెడ్డిలోని అశోక్‌నగర్ కాలనీలో ఇంటిని నిర్మించుకొని ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి స్వగ్రామానికి వెళ్లారు. సోమవారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి చూడగా దొంగలు పడినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. రూ.5 లక్షల నగదు, 10 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితులు చెబుతున్నారు.